నాలుగేళ్ళ కాంతి, ఆరేళ్ళ హరి సీరియస్‌గా కూచొని టి.వి.లో 'లిటిల్ రాస్కెల్స్' షో చూస్తున్నారు. మధ్య మధ్యలో హరి వెక్కిళ్ళు పోతున్నాడు. బాగా ఎఱ్ఱగా వాతలుతేలిన చెంపను చేతితో తడుముకొంటూ కన్నుల్లో నీరు తుడుచుకొంటూ టి. వి. వైపు కళ్ళు అప్పజెప్పి కూచున్నాడు.

కాంతి బిక్కు బిక్కుమంటూ టి. వి. వైపు కొంతసేపు, అన్నయ్య వైపు కొంతసేపు చూస్తూ భయపడిం దానికిమల్లే నిశ్శబ్దంగా కూచుంది. ఎందుకో మరి పాప బుగ్గలమీద కన్నీటి చారికలు వచ్చాయి.

శారద సీరియస్‌గా వంట చేస్తున్నది. మధ్య మధ్యలో టిష్యూతో కన్నులు అద్దుకొంటూ వున్నది. ప్రభాకర్ అంతకన్నా సీరియస్‌గా డైనింగు టేబులు దగ్గరకూర్చొని 'షికాగో ట్రిబ్యూన్' చదువకపోయినా అటూ ఇటూ పేజీలు తిప్పేస్తున్నాడు.

వంటపని పూర్తిచేసుకొని శారద పిల్లలున్నవేపు వెళ్ళింది. హరి శారద వంక చూశాడు. ఇక ఏడుపు ఆపుకోలేక చేతులో మొహం దాచుకొని గట్టిగా ఏడ్చాడు. శారద హరిని వడిలోకి తీసుకొంది. "ఏడవకు నాన్నా! మా బుజ్జి కదూ! ఏదీ ఇలా చూడు" అంది పూడుకుపోయిన గొంతుతో. హరితల ఎత్తాడు. మొహం నిండా కన్నీటితో తడిసిపోయి రెండు చెంపలూ ఎర్రగా కందిపోయి వున్నవి. శారదకు కడుపులో కెలికినట్లయింది. ఎంతో పచ్చగా ముద్దుగా వుండే మొహం అలా చూడవలసి వచ్చినందుకు పట్టరాని దుఃఖం వచ్చింది. హరిని చేతుల్లోకి తీసుకొని కళ్ళుమూసుకొంది ఎంతోబాధతో. మూసిన కళ్ళనుండి వేడివేడి కన్నీటి బొట్లు జల జల రాలాయి. ఇదంతా చూచి కాంతి కూడా బిగ్గరగా ఏడవటం మొదలుపెట్టింది. ప్రభాకర్ ఏదో తప్పు చేసినవాడికి మల్లె మొహం దించుకొన్నాడు.

శారద హరిని వదలి గబగబ లేచి పిల్లలిద్దరినీ ఓదార్చి బాత్‌రూమ్‌కు తీసుకువెళ్ళి మొహాలు కడిగింది. తలలు దువ్వి డైనింగు టేబులు దగ్గరకు తీసుకువచ్చింది. శారద టేబులు మీద అన్నీ అమరుస్తూ వుంటే కాంతి. హరి కుర్చీలు ఒక మూలకు జరుపుకొని కూర్చున్నారు, ప్రభాకర్‌కు దూరంగా. శారద మౌనంగా పిల్లలిద్దరికీ ప్లేట్లలో అన్నం పెడుతున్నది. ప్రభాకర్‌కు వాళ్ళు ముగ్గురూ ఒకటయి తనను విరోధిని చూసినట్లు చూస్తున్నారనిపించింది. నెమ్మదిగా హరి వైపు చూశాడు. అంతవరకు వాళ్ళ నాన్నను దొంగ చూపులు చూస్తున్న హరి కళ్ళు చిట్లించుకొని బుంగమూతి పెట్టి తల యింకొక వైపు త్రిప్పుకొన్నాడు. కాంతి కూడా అటు వైపు తిరిగిపోయింది. పిల్లలిద్దరి చేష్టలకు ఒక క్షణం నవ్వు వచ్చి చిన్నగా నవ్వి తన కుర్చీని పిల్లల దగ్గరగా జరుపుకున్నాడు.

ఈసారి హరి తనప్లేటువైపు చూస్తూనే క్రిందుగా వాళ్ళ నాన్నవైపు చూడసాగేడు. అది కనిపెట్టి ప్రభాకర్ "దొంగ" అంటూ హరిని రెండుచేతుల్తో పట్టుకొని ముద్దుబెట్టుకొన్నాడు. ఒక్కసారి అన్నీ మరిచి హరి కిలకిలమన్నాడు. పాప కూడా నవ్వింది. శారద ప్రభాకర్‌వైపు చూసింది. అతడు గర్వంగా భార్య కేసి చూశాడు. అయినా శారదకు నవ్వు రాలేదు. ఇందాకటి సంఘటనే మనస్సులో మెదులుతున్నది. నిశ్శబ్దంగా తన పని తను చేసుకుపోతున్నది. ఒక్క క్షణం ప్రభాకర్ మనస్సు చివుక్కుమనిపించింది శారద ప్రవర్తనకు. అయినా వాతావరణం ముందుకన్న కాస్త మెరుగు కావడంవల్ల పిల్లల్ని నిదానంగామాటల్లోకి దించాడు.

శారద పిల్లల్ని. భర్తను చూస్తున్నది. హరికి యింతవరకు దెబ్బలతో కందిన మొహం మామూలు అవనేలేదు. అయినా నవ్వుతూ హాయిగా అన్నీ మరచి వాళ్ళ నాన్నతో ఆ కబుర్లలో పడిపోయాడు. అందుకే అంటారేమో పిల్లల మనస్సుల్లో దేవుడుంటాడని. ప్రభాకర్ ఎంతో ఆత్మీయంగా కొడుకు తల నిమురుతున్నాడు. "డాడీ! యిక ఆ అంకుల్ మనింటికి రావద్దు" అన్నాడు వున్నట్టుండి. భార్యాభర్తలిద్దరూ ఒక్కసారి వులిక్కిపడి ఒకరి మొహం ఒకరు చూసుకొన్నారు. అంతలో, ప్రభాకర్ తేరుకొని "తప్పు నాన్నా! అలా అనకూడదు. అంకుల్ పెద్దవారు" అన్నాడు.

ఇక శారద పుండబట్టలేక "ఏమిటండీ తప్పు? వారు చెప్పిందే కరెక్టు. నేనూ మీకామాటే ఖచ్చితంగా చెప్పాలనుకుంటున్నాను. అతడిహ మనింటికి రానవసరం లేదు" అంది. ఆమె ధోరణికి చాల ఆశ్చర్యపోయి "శారదా!" అన్నాడు. "ఎందుకలా ఆశ్చర్యపోతారు? మళ్ళీ చెబుతున్నాను. నేనన్నా, నా పిల్లలన్నా విలువలేని వాళ్ళు నా యింటికి రానవసరంలేదు" అంది. పిల్లల ముందు వాదన చేయడం ఇష్టంలేక "ఏమిటి శారదా నీ ధోరణి చిన్న పిల్లల్ని మించిపోయింది? త్వరగా అన్నం వడ్డించు. మనమూ తిని పిల్లల్ని అలా బయటకు తీసుకువెళ్ళ వద్దాం" అన్నాడు.

ఇంతజరిగీ ప్రభాకర్ తననే మందలించడం శారదకు కోపం తెప్పించింది. ఆ విసురు రెఫ్రిజిరేటరు మీద, గిన్నెలమీద కొంతసేపు చూపింది. ఎంతకూ శారద పనిలో నుంచి తెమలకపోయేసరికి "త్వరగా బయలుదేరు శారదా" అన్నాడు. "నాకు ఎక్కడికీ రావాలని లేదండీ. కావాలంటే పిల్లల్ని తీసుకొని మీరు వెళ్ళిరండి" అంది. 'హతోస్మి' అనుకొన్నాడు ప్రభాకర్. 'ఈ శారదకు కోపం వస్తే పోగొట్టడం ఒక పట్టాన వీలు పడదుగద. మొండిఘటం' అనుకున్నాడు. పిల్లల వంక తిరిగి "ఓ. కే. కిడ్స్. మనం ఇప్పుడు ఎక్కడికీ వెళ్ళడం


## యాక్సిడెంటైన కవిత

క్రీర్తిశేషుడైన డ్రైవర్
రోడ్ల మహాసాగర తీరాన
కాస్సేపు బోరుకొట్టి
పెట్రోల్ చుక్క ఒకటి
విసిరేసి
తిరిగి వెళ్ళిపోయాడు.

లారీలనే కుక్కపిల్లలు
బాడీలూపుకుంటూ వచ్చి
పెట్రోలు చుక్కని చూసి
నాకేందుకు ప్రయత్నించినై.

ఇటువంటి చుక్క అవి
ఇదివరకు చూళ్ళేదు.
డ్రైవర్ వదిలేసిన చుక్క
కుక్కపిల్లల్ని బాధిస్తోంది.
టైర్లు ఊడిన చక్రాల్లా
అన్ని దిక్కులా దొర్లుతున్నైన
తను లేకపోయినా
తనకేసే చూస్తోంది చుక్క.
కలకత్తాకీ మద్రాసుకీ మధ్య
ఆకారం దాల్చిన చుక్క
నెమ్మదిగా ఇంకిపోతూ రోడ్ల
రాళ్ళ నుంచి తప్పించుకుంటోంది
నలుచదరంగా పెత్తనంలి స్తరించి
పాఠకులపై "ఐరన్ మేకు" దింపుతుంది.
(ఇస్మాయిల్ "కీర్తిశేషుడైన కవి" చదివి కృతజ్ఞతలతో)

—రామమూర్తి



# లిటిల్ రాస్కెల్స్

అరుణ గల్లా

లేదు. మీ అమ్మ కోప గృహంలో చేరిందీ రోజు. అందుకని మన ఆటలన్నీ ఇంటి లోనే"అంటూ ఫామిలీరూములోకి వెళ్ళాడు. శాంతి గబగబ వెళ్ళి వుడెన్ బ్లాక్సు తెచ్చి "రాజీ. మనం ఎంచక్కా ఇల్లు కట్టు కొందాం" అని వచ్చింది. హరి పజిల్స్ తెచ్చుకొన్నాడు.

ప్రభాకర్ వాళ్ళిద్దరినీ గమనిస్తూ పేపరు చదువుకొంటున్నాడు. శారద సీరియస్‌గా సోఫాలో కూర్చుని ఎటో చూస్తున్నది. ఇందాకటి సంఘటన ప్రభాకర్ మనసులో కూడా మెదలకపోలేదు. అయితే కొందరుంటారు. తమ సంతోషం కోసం ఇతర్లు బాధపడినా లెక్కచేయరు. మరి కొందరు తాము ఎంత బాధపడినా ఎదుటివారిని సంతోషపెట్టడానికి ప్రయత్నిస్తూవుంటారు. ఈ రెండవకోవకు చెందినవాడు ప్రభాకర్.

మంచిలో కూడా అతి మంచితనం కలవాడు. అంతకన్నా మెత్తని హృదయంగలవాడు. ఒక్కొక్కసారి యీ అతి మంచి తనం కూడా అంత మంచిది కాదు. ఎందుకంటే తమ వలన ఎదుటివారు ఎంతయినా బాగుపడతారు. మరెన్నయినా లాభాలు పొందుతారు. వీళ్ళ స్నేహంలో ఎన్నయినా సాధించుకోగలరు. కానీ యిటువంటి మంచి తనం ఇంటి వారి యెడల మటుకు శూన్యం అవుతుంది. ఇతర్ల సంతోషం కోసం పాకులాడుతున్నపుడు తన వాళ్ళు కోల్పోయే సంతోషం యీ మంచి బుర్రలకు తోచవు. తోచినా నత్తింగ్ ఈజ్ సీరియస్ అనుకొంటారు.

శారద మనస్తత్వం ప్రభాకర్ మనస్తత్వానికన్నా కొంత భిన్నంగా వుంటుంది. మంచితనం వుండవలసిందే. అది ఎంత వరకంటే మన సాంఘిక, వ్యక్తిగతమయిన సుఖ సంతోషాలకు భంగం కలుగనంత వరకు అనుకుంటుంది. అదే అప్పుడప్పుడు ప్రభాకర్‌తో వాదిస్తూంటుంది.

పాప ఇల్లు కట్టడం పూర్తి చేసింది. హరి యింకా పజిల్సు పెట్టడం కుదరక అవస్థ పడుతూనే వున్నాడు. "డాడీ, నా ఇల్లు పూర్తయింది. మీరేమో అమ్మను వంట చెయ్యమను. ఆరోజు మీరు ఇంటిలోకి వెళ్ళడానికి అందరినీ పిలిచారే! అలాగ నేనూ పిలవాలి

అంటూ హడావుడిపడి పోతున్నది. హరి గబుక్కున కాంతి దగ్గరకు వచ్చి "చెల్లీ! ఎవర్ని పిలిచినా ఇందాక వచ్చిన అంకుల్‌ను మటుకు పిలవకు" అన్నాడు. అలాగేనంటూ పాప అటూ ఇటూ మనుష్యుల కోసం వెదకుతున్నట్టు ఇమిటేట్ చేస్తున్నది. హరి మాటలకు మళ్ళీ ఒకసారి భార్యాభర్తలిద్దరూ ఒకరిమొహంలోకి ఒకరు చూసుకొని నిశ్శబ్దంగా కూచున్నారు.

పసివాడు మనస్సులో ఎంతగా బాధ పడకపోతే యింత గట్టిగా గుర్తు పెట్టుకొని మరిమరీ చెబుతాడు అనిపించింది శారదకు. హరిని దగ్గరకు పిలిచి తల నిమురుతూ వడిలో పడుకోబెట్టుకుంది. అలాగే నిద్దుర పోయాడు. నిద్దట్లో కూడా అప్పుడప్పుడు వెక్కిళ్ళుపోతున్నాడు. కందిపోయిన చంపను మరొక్కసారి తడిమి చూచింది. రామారావు మనస్సులో మెదిలాడు. సంవత్సరం క్రితం ప్రభాకర్ తీసుకువచ్చాడు ఒకరోజు."ఇతను నేను పనిచేస్తున్న ఆఫీసులోనే పనిచేస్తున్నాడు. పేరు రామారావు.ఇంటి భోజనం తిని చాలాకాలమయిందట.ఇక్కడ ఎవరూ తెలిసిన వారు లేరట" అంటూ పరిచయం చేశాడు. తను కూడా ఆనందంగానే ఆహ్వానించింది. తోటి భారతీయుడు. అందునా తమ ప్రాంతం,తమ భాష అనేసరికి తనకూ చాలా సంతోషం కలిగింది. ఆత్మీయంగా పలకరించి అన్నం పెట్టింది. అతను కూడా కలుపుగోలుగానే వున్నాడు. ఉన్నంతసేపు బాగా కబుర్లు చెప్పుకొన్నారు.అతను వెళ్ళేటప్పుడు"మీకు రావాలనిపించినప్పుడంతా వస్తూ వుండండి. మీకంటూ వేరుగా చేసేదేమీ వుండదు.మాకు వండుకున్నదే మీరూ తినవచ్చును"అంటూ సాగనంపింది. అప్పటి నుంచి తరచూ అతడు వస్తూ వుండడం జరుగుతున్నది. తరచూ అనేకన్నా వారంలో నాలుగు రోజులు యిక్కడేఅంటే బాగుంటుందేమో! శారదకయినా సరదాగానే వుంటున్నది.

కానీ! వచ్చిన చిక్కంతా అతడు అలా రావడం. తినటం. కబుర్లు చెప్పుకోవటం వెళ్ళడం వరకే వుండివుంటే బాగుండేది. అలా కాకుండా లేని చనువును తీసుకోవడం ప్రారంభించాడు. అదీ పిల్లల విషయంలో ఎంతసేపూ విమర్శించడం మొదలుబెట్టాడు. చీటికిమాటికి "పిల్లలు సరిగా పెరగడం లేదండీ. సరియైన పద్ధతులు నేర్చుకోవడం లేదు"అనేవాడు.మొదటమొదట శారదఏదోలే అని సరిపెట్టుకొనేది. కానీరానురాను అతను రావడమే పిల్లల్ని తప్పులుపట్టడానికే అన్నట్టుగా ప్రవర్తించేవాడు.

ఒకరోజు ప్రభాకర్ రామారావు భోజనానికి కూర్చొన్నారు. తను టేబులుమీద అన్నీ సర్దుతూ వున్నది. కాంతి కెవ్వున అరిచింది. శారద గబగబ పరుగెత్తుకెళ్ళింది. ఏమిటంటే"హరి కలరు పెన్సిలు లాక్కున్నాడు" అంటూ గుక్కలు పట్టి ఏడ్చింది. హరికి నచ్చచెప్పి ఆ పెన్సిలు కాంతికి తీసియిచ్చి వచ్చింది. ఇంతలో అతను తింటూ శారదవైపు చూసి"మీ పిల్లలకు మరీ అల్లరి ఎక్కువయిపోతున్నదండీ. మీరు కొంత శ్రద్ధ చేయాలి" అన్నాడు. తనకు మనస్సు చివుక్కుమనిపించింది. అయినా ఏమీ అనలేదు.

ఇంకొకమారు తను తెలిసినవారిని కొంతమందిని భోజనానికి పిలిచింది. అందరూ భోజనాలయిన తరువాత కూర్చుని పేకాడుకొంటున్నారు. టయిము పదిగంటలపైనే అయింది.హరి వచ్చి"మమ్మీ నన్ను పడుకోబెట్టు"అని పిలిచాడు. తను ఆట మధ్యలో వున్నది."కొంతసేపు వుండు నాన్నా" అన్నది వాడికి బాగా నిద్దుర వచ్చినట్టుంది. కాదుమమ్మీ ఇప్పుడే రావాలి అంటూ తనను లాగుతున్నాడు. ప్రక్కనేవున్న ఆమెను తన పేకనిచ్చి"ఆడుతూ వుండండి ఇప్పుడే వస్తాను"అని లేచింది. అప్పుడు రామారావు తననుచూచి"మీరు మరీ గారాబం చేసి మీ పిల్లలను చెడగొడుతున్నారండీ ఆ పిల్లలంతా ఆడుకోవడంలేదా" అన్నాడు. తనకు నిజంగా చాలా బాధకలిగింది.అందరి ముందూ అనని పట్టుకొని అలా అనేసరికి ఎంతోరోషం వచ్చింది.పిల్లవాడికి నిద్రవస్తే పడుకోబెట్టమని అడిగితే కూడా అదీ అల్లరేనా అనిపించింది. మాట్లాడకవూరుకొంది.

మరో రోజు పిల్లల్ని తీసుకొని గ్రేట్ అమెరికాకు వెళదామనుకొంటుంటే నేనూ వస్తాను ఏం తోచడంలేదని వచ్చాడు. అందరూ కలిసి గ్రేట్ అమెరికా వెళ్ళారు. రైళ్ళు చూసి పిల్లలు చాలా ఉత్సాహపడ్డారు. ఎంతమందో పిల్లల్ని తీసుకొని వచ్చారు. అది ఒక పెద్ద బాలలలోకంలా వున్నది. హరి బాగా ఎక్సయిట్ అయిపోయాడు. కావలసినన్నిమార్లు అన్ని రైళ్ళు తిరిగారు. మధ్యాహ్నం అయేసరికి బాగా ఎండ మాడుతున్నట్లనిపించింది. అమెరికాలో ఎండలుండవనుకుంటాముగానీ ఒక్కొక్కసారి బయట ఇండియాను మించిపోయినట్లుంటుంది. ఎక్కడబడితే అక్కడ ఎయిర్‌కండిషన్లు వుండబట్టి సరిపోయింది. లేకుంటే యిక్కడా ఒక్కొసారి


మా ఖాతాదారులకు సంక్రాంతి శుభాకాంక్షలు!

ఫిబ్రవరి విడుదల!

చంటబ్బాయ్
చంటబ్బాయ్
చంటబ్బాయ్
చంటబ్బాయ్

శ్రీ మహాలక్ష్మి బుక్ ఎంటర్‌ప్రైజెస్
విజయవాడ-2



నెలకు 1,000 -లు
సంపాదించండి

ఫోటోగ్రఫీ టీచరు రు. 15/-: ఎలక్ట్రిక్ గైడ్ రు. 15/-: వివాహ జీవితం 100 బొమ్మలతో రు. 15/-: మెడికల్ సెక్స్ గైడ్ 188 బొమ్మలతో రు. 20/-: టైలరింగ్ & కటింగ్ రు. 16/-: డ్రాయింగ్ అండ్ పెయింటింగ్ గైడ్ రు. 15/-: ట్రాన్సిష్టరు రేడియోగైడ్ రు. 15/-: 300 ... గైడ్ రేడియోగైడ్ రు. 30/- ప్రతిదానికి పోస్టేజి రు. 2/- అదనం.

ILFA BOOk DEPOT (AJ–25)
ALIGARH



నూతన యవ్వనం పొందండి ! సంతానవంతులు కండి !



చర్మ వ్యాధుల నుండి విముక్తులు కండి !

దురభ్యాసముల వలన కలిగిన నరముల బలహీనత, దాంపత్య సుఖము లేకపోవుట, సంతానము లేకపోవుట, ఉబ్బసము, మేహ మచ్చలు మొ॥ సమస్త దీర్ఘవ్యాధులకు అద్భుత ఆయుర్వేద చికిత్స! పోస్టుద్వారా చికిత్స కలదు.

క్యాంపులు:– ప్రతి ఆదివారం "భీమవరం"షణ్ముఖ లాడ్జిలో ఉదయం 9 గం॥ నుండి సాయంత్రం 6-30 గం॥ వరకు.

ప్రతినెల 1 మరియు 16 తేదీలలో "రాజమండ్రి" హోటల్ అప్సరలో మధ్యాహ్నం 12 గం॥ నుండి రాత్రి 9 గం॥వరకు.

డాక్టరు. డి. మార్కండేయులు, ఆయుర్వేదభిషక్
పార్కు రోడ్, గుడివాడ–521 301. ఫోన్ : 622 హాస్పటల్, 540 నివాసం.

భరించరానంత వేడిగా వుంటుంది. పిల్లలిద్దరూ బాగా అలసిపోయారు. ఆకలి అంటూ మొదలుపెట్టారు. అక్కడే చిన్న షెల్టరు క్రింద హాట్ డాగ్స్. హోమ్ బర్గర్సు అమ్ముతున్నారు. వెళ్ళి వాళ్ళకు కావలసినవి పెట్టించి అందరూ లంచ్ ముగించారు.

"కొంత సేపు ఎక్కడయినా కూచుందాం తరువాత మొదలు వచ్చును అన్నాడు రామారావు. పిల్లలకు తినగానే మళ్ళీ మామూలు ఉత్సాహం పుంజుకొంది. "డాడీ! పద డాడీ కప్పు అండ్ సాసర్ రైడుని స్టార్టు చేస్తున్నారు" అని తొందర పెట్టారు. "ఇప్పుడే కదోయ్ తిరిగింది. కాసేపు కూచొని తరువాత వెళ్ళవచ్చును" అని విసుక్కొన్నాడు రామారావు. హరి చిన్నబుచ్చుకొన్నాడు. "అవును హరీ! కాసేపు రెస్టు తీసుకొని మళ్ళీ వెళదాం" అన్నాడు ప్రభాకర్. హరి వినలేదు. పిల్లలు ఛాన్సు వచ్చినప్పుడు బాగా ఆడుకోవాలని అనుకొంటారు. అపార్టుమెంటులో ఎటూ గంతులెయ్యడానికి వీలుండదు. తీరిందే యీ రోజు. బయటకు వచ్చినప్పుడయినా వాళ్ళ సంతోషం ఎందుకు పాడుచెయ్యాలని "మీరెళ్ళి కూచుని తరువాత రండి. యీలోపు పిల్లల్తో నేను వెళతాను" అంది శారద. "మీరేమీ అనుకోనంటే నేనొకటి చెబుతాను శారదగారూ! పిల్లల్ని వీలయినంతమటుకు కంట్రోల్‌లో వుంచాలి. వాళ్ళ యిష్టం వచ్చినట్టు మనం ఆడటం మొదలుబెట్టినామంటే ఎందుకూ కొరగాకుండా పోతారు. మొక్కయి వంగనిది మానయి వంగుతుందండీ! యింత సేపు తిరిగాము. కొంత సేపు వాళ్ళని కూర్చోబెట్టలేరూ?" అన్నాడు రామారావు.

ఏమిటితడి అధికారం అనిపించింది శారదకు. ఆటలు పిల్లలు ఆడక పెద్దవారు ఆడాలనుకుంటారా? గంతులు వెయ్యాలని అనుకోవడం పిల్లల సహజగుణం. బాగా పెద్ద వారయిం తరువాత గంతులేస్తుంటే వాళ్ళకు మానసిక రోగం ఏదో వుండివుంటుందని అనుకుంటాము. అలాగే పిల్లలుగా వున్నపుడు వాళ్ళు గంతులేసి ఆడుకొనకపోతేనే మానసిక రోగం వుందనుకోవాలి. ఇప్పుడు తన పిల్లల్లో ఏ అబ్‌నార్మాలిటీ యితనికి కనిపించింది? అని బాగా రోషం వచ్చింది. "తీసుకు వచ్చిందే యీ రోజు యిలా తిప్పడానికి అందులో చెడిపోవడం ఏముందండీ!" అన్నది శాంతంగానే. "ఏమో బాబూ! వాళ్ల మీ పిల్లలు. ఎంతయినా అందరికీ యిలా చెబుతానా? మీరంటే నాకు భేదంలేదు గనుక చెబుతున్నాను. మీరు మరీ గారాంచేస్తున్నారేమో అనిపిస్తున్నది" అన్నాడు. హరేమో నిలువనివ్వకుండా తనని లాగుతున్నాడు. ముందే తనకు అతని మాటలకు మనస్సులో ఎంతయినా విసుగ్గా వున్నది. పిల్లలు రా సుమీ! వెళదాం అని మారాం చేస్తుంటే పిల్లల మీద తనకు పిచ్చికోపం వచ్చింది. తను ఎక్కడుండి ఏమి చేస్తుందీ అన్నీ మరచిపోయింది. హరిని బలంకొద్దీ రెండు అంటించేసిందీ "వెధవా! కాసేపుఆగలేవురా!" అంటూ. అనుకోకుండా దెబ్బలు తగిలేసరికి హరి బిగ్గరగా ఏడ్వటం మొదలుబెట్టాడు చుట్టూ వున్న అమెరికన్సు వింతగా చూస్తున్నారు. వాళ్ళు పదిమందిలో వున్నపుడు పిల్లల్ని ఇలా కొట్టుకోరు. ఏదయినా విసిగిస్తే ఓపిగ్గా సమాధానపరుస్తారు. ప్రభాకర్ వెళ్ళి హరిని బుజ్జగించ ప్రయత్నించాడు. ఎప్పుడూ అమ్మానాన్నల దగ్గర దెబ్బల రుచి ఎరుగని హరి రోషంతో మరింత గట్టిగా ఏడ్పు మొదలుబెట్టినాడు.

"పోనీలే ఏడ్పు నిలిపివెయ్యి హరీ. మనం ఇప్పుడే కప్పు సాసర్ రైడుకు వెళదాం. మా నాన్న కదూ. చుట్టూ జనం చూడు ఎంత వింతగా చూస్తున్నారో అలా నలుగురిలో ఏడ్వవచ్చా!" అని ప్రభాకర్ ఎంత చెప్పినా హరి ఏడ్పు మానలేదు. "వెళదాంరా" అని ప్రభాకర్ ఎత్తుకోబోతుంటే


# ఋణము లభించును

**తనఖాలు, తాకట్టులు, గ్యారంటర్లు అవసరము లేకుండగను మరియు తనఖాలు, తాకట్టులు, గ్యారంటర్లతోను వివిధ శ్రేణిలలో ఋణములు 10 సంవత్సరములలో తీర్చేటట్లు లభించును. వివరముల కొరకు స్టాంపులు అతికించిన స్వంత చిరునామా గల కవరుతో ఈ క్రింది అడ్రసునకు ఇంగ్లీషులో వ్రాయండి.**

**BOX NO. 114,**

**% ANDHRAJYOTI WEEKLY,**

**VIJAYAWADA-520 010 (A. P)**



దేశ విఖ్యాతిగాంచిన విమల్ చీరల్లో సరిక్రొత్త శ్రేణికై విచ్చేయండి నేడే విమల్ దీప్‌కి



VIMAL

# విమల్ దీప్

ప్రకాశంరోడ్; గవర్నరుపేట సెంటర్;

విజయవాడ - 520002. ఫోన్ నెం. 75558

VTS/vp/84

పట్టు విడిపించుకొని క్రిందకు జారుతూ గిల గిల తన్నుకోవడం మొదలుబెట్టినాడు.

"నేను చెప్పలేదండీ! శారదగారు మరీ పాడు చేస్తున్నారు పిల్లల్ని. ఎంతయినా తల్లిఅంటే కళ్ళభయం వుండాలి. మేము ఆరుగురం పిల్లలం. మా నాన్నగారు ఎప్పుడూ మా విషయం పట్టించుకొనేవారు కారు. అంతా మా అమ్మే చూసుకొనేది. అమ్మ ఎప్పుడయినా అలా కళ్ళతో చూస్తేనే హడలిపోయేవాళ్ళం. అలా పెంచాలి. మరీ మీరు భయంలేకుండా పెంచుతున్నారు"అని ఒక ప్రక్క లెక్చరుమొదలు బెట్టాడు రామారావు.

అసలే చిరాగ్గా వున్నారు శారద, ప్రభాకర్. ఒక ప్రక్క ఎండ వేడిగా వున్నది. గాలే ఆడటం లేదు. హరి మారాము వీటితోనే సతమత మవుతుంటే రామారావు మాటలు మరీ నిప్పుకు ఆజ్యం పోసినట్టు మండిపోయాడు ప్రభాకర్ "వెధవ. వీడిని యిలా కాదు రైడు లేవు. ఏమీ లేవు. శారదా పాపను తీసుకో. ఇక చాలు యివాల్టి సరదాలు. పదండి ఇంటికి వెళదాం" అన్నాడు ఆ మాట విని హరి మరీ ఆగడం మొదలుబెట్టాడు. హరిని గట్టిగా రెక్కవిరిచి పట్టుకొని కొంతదూరం తీసుకువెళ్ళి మనుష్యులు లేకుండా చూసి "గొంతులో నుంచి శబ్దం వచ్చిందంటే నరికేస్తాను జాగ్రత్త. ఏడుపు నిలుపుతావా? నిలుపవా?" అని చంపకు పట్టి ఛెళ్ళు ఛెళ్ళు మనిపించాడు. శారద పరుగెత్తుకొని వచ్చి ప్రభాకర్ చేయిపట్టి ఆపించి. తండ్రి చేతి దెబ్బలు తగిలేప్పటికి హరి ఒక్క చచ్చిపోయి ఏడ్వటం ఆపేశాడు. ఎంతో కోపంతో పిల్లల్ని కారులో వేసుకొని ఆ మధ్యాహ్నానికే అన్నీ కట్టిపెట్టిఇల్లు చేరుకొన్నారు. కారులో కూడా మహానుభావుడు పిల్లల పెంపకం గురించి ఎంత శ్రద్ధ చేయవలసింది. వాళ్ళ అమ్మ ఎలా పెంచేదీ. అన్నీ ఏకరువు పెడుతూనే వున్నాడు. అప్పుడు శారద అనుకొంది. 'ఎలా పెంచినా నా పిల్లల్ని నలుగురిలో ఎలా సభ్యతగా వుండాలో నేర్పి పెంచుతాను. మీ అమ్మలాగ ఊరివాళ్ళ మీదపడి వాళ్ళ సంతోషాన్ని జలగలాగ పాడుచేసేటట్టు మాత్రం పెంచను' అనుకొంది మనస్సులో కసిగా. అతడంటే చాల అసహ్యం పుట్టింది. ఆరోజు నుంచి అతడు ఇంటికి వస్తాడంటేనే గుండెలు అరచేతుల్లో పెట్టుకొని వున్నట్టుంటుంది.

అప్పటినుంచి అతడు ఎప్పుడు వస్తానన్నా ఏదో పని వుందని చెప్పింది. అతడు మనింటికి వద్దు అని భర్తకు చెబుతూనే వుంది. ఈ అపర సత్య సంధుడు వస్తానంటే పనివుందని ఎలాచెప్పమంటావు శారదా? అంటాడు. అతడు రాక మానడమూ లేదు. వచ్చినపుడంతా పిల్లలకు ఏదో ఒకరకంగా దెబ్బలు తగలడం అంతకన్నా తగ్గడమూ లేదు.


మళ్ళ యీ రోజు వచ్చాడు. అతడు వస్తూనే పిల్లల్ని వాళ్ళ గదిలోకి పంపింది. తనుకూడా వెళ్ళి కొన్ని గేమ్సు అరేంజిచేసి "మీరు ఇవి ఆడుకొంటూ వుండండి. మా బంగారు కొండలు. మమ్మీ పిలిస్తేగానీ క్రిందకు రాకూడదు తెలుసా!" అని చెప్పి తను వెళ్ళింది. "ఇవ్వాళ ఇల్లు చాలా నిశ్శబ్దంగా వున్నదే. ఏరీ మీ సుపుత్రికా సుపుత్రుడు"అన్నాడు రామారావు.తనుకూడా ఈ మధ్య కొంతకటువుగానే సమాధానమివ్వడం నేర్చుకొంది. "సుపుత్రుడు. సుపుత్రిక కాక ఏమిటండీ? కాకి పిల్లలు కాకికి ముద్దు" అని తన పనులు తాను చేసుకోవడంలో లీనమయింది.

ప్రభాకర్ రామారావు ఫామిలీ రూంలో కూర్చొని మాట్లాడుకొంటున్నారు. తను వాళ్ళకి కాఫీ పెడుతున్నది. టి.వి లో బేస్ బాల్ గేమ్ వస్తున్నది. ఇంతలో పిల్లలిద్దరూ పైనుంచి గంతులేసుకుంటూ దిగి వచ్చారు. "లిటిల్ రాస్కెల్స్ చూడాలి" అంటూ. తనకు కడుపులో మంట పడ్డట్టు అయింది. ఏమిటో ఈ మధ్య తన ఇంటిలోనే తను ఇతర్లకోసం భయపడుతూ బ్రతుకుతున్నట్లనిపిస్తున్నది. ఎవరయినా స్నేహితులుఇంటికవస్తే ప్లజెంటుగా వుండాలిగానీ. ఏమి జరిగితే ఏ తప్పు వస్తుందో అన్నట్లుఫీలయ్యేటప్పుడు ఈ పరిచయాలకు అర్థం లేదనిపిస్తుంది. తను పిల్లల్ని పిలిచే లోపే పరుగెత్తుకెళ్ళి టి.వి.లో గబగబ చానల్స్ త్రిప్పేస్తున్నాడు. "అరే! హరీ! మేము గేము చూస్తున్నాం. మళ్ళ చానల్ మార్చు" అన్నాడు రామారావు."ఊఁహూ" అంటూ తల అడ్డంగా త్రిప్పాడు హరి. "అంకుల్ గేము చూస్తారు హరీ తరువాత నీవు చూడవచ్చు గేమ్ పెట్టు" అన్నాడు ప్రభాకర్. ఈమధ్య రామారావు విషయంలో హరి కూడా కొంత ఖాతరులేనట్లు ప్రవర్తిస్తున్నాడు.

పసిపిల్లలకయినా తెలుస్తుంది- ముద్దు చేసేవారిని మరువకుండా ఎలా గుర్తుపెట్టుకొంటారో చీటికి మాటికి విసుక్కునేవారినీ అలాగే గుర్తు పెట్టుకొంటారు. ఒక విధంగా ఆ పసి మనస్సుల్లో ఏహ్యతను పెంచుకుంటారు. అందుకే మొండిగా 'లిటిల్ రాస్కెల్స్' షో చూడవలసిందే అని పట్టుబట్టారు.

"అబ్బ మీ పిల్లలు మరీనండి.ఆ విమల గారి పిల్లలు చూడండి : అంత క్రమశిక్షణ ఎక్కడా చూడలేదు. వాళ్ళమ్మ ఆఁ! అంటే చాలు హడలిపోతుంటారు. అసలు వున్న చోటయినా తెలియదు. ఎవరయినా వాళ్ళ యింటికి గెస్టు వెళితే వాళ్ళ గదుల్లోకి వెళ్ళిపోతారు. వాళ్ళ అమ్మ నాన్న పిలిస్తే క్రిందకు వస్తారు. చాల తెలివయిన పిల్లలు. అలా వుండాలి పిల్లలంటే. మీరు సరిఅయిన కేర్ తీసుకోకపోతేలాభంలేదండీ."అన్నాడు శారద వంక తిరిగి. శారదకు వళ్ళు మండిపోయింది, ఇంటికి వచ్చి అతడు అంత సభ్యతలేకుండా మాటలాడుతుంటే ఏమనాలో తెలియక "అందరూ ఒకేవిధంగా వుండరండీ.ఎలా వుంటారండీ? ఇలాంటి అల్లరి పిల్లలు వుండకేగదా అలాంటి మంచి పిల్లల సంగతి ఈరోజు మీరు యిక్కడ చెప్పగలిగింది" అని గిరుక్కున వెనక్కు తిరిగి వెళ్ళిపోయింది.

ప్రభాకర్‌కు రామారావు మాటలు ఉక్రోషం తెప్పించాయి. మళ్ళ అడిగాడు హరిని."చానల్ మారుస్తావా? లేదా?" అని.



హరి అడ్డంగా నిలబడి చేతులలో టి.వి.ని కౌగిలించుకొని "ఊహూ!" అంటూ తల అడ్డంగా తిప్పాడు. ఫలితంగా ఆరోజు బాగా దెబ్బలుపడ్డాయి. అతడేమో "పనివుంది మళ్ళీ ఎప్పుడయినా కలుద్దాం" అంటూ వెళ్ళిపోయాడు. శారదకు చాల కోపంవచ్చింది. ఇతడు తప్ప తన పిల్లల్ని ఇంత మటుకు ఇలా ఎవరూ విమర్శించ లేదు. తన పెంపకం బాగులేదనలేదు. ఇతడి పరిచయం అయిన దగ్గర నుంచి ఇంటిలో మనశ్శాంతే కరువయిపోతున్నట్టున్నది. అసలే ఈ దేశంలో టయిము దొరికేది చాల తక్కువఅ వున్న కాలంలోనయినా పిల్లల్ని ముద్దు చేయడానికి, వారితో కాలక్షేపం చేయడానికి వీలుకాకపోతున్నది. ఇతడు వస్తే అన్ని మర్యాదలు చేసి ఇతడిని ఎంటర్‌టెయిన్ చేసి అనవసరంగా పిల్లల్ని బాదుకోవలసి వస్తున్నది.

నిజానికి తన పిల్లలు చాల బుద్ధిమంతులే. అయితే పిల్లలన్న తరువాత ఎప్పుడూ ఒక రకంగా ఎలా వుంటారు? అప్పుడప్పుడు వాళ్ళకు కావాలనుకొన్నవి జరిగేదాకా విసిగించడం అనేది ఏ పిల్లలకయినా సహజ గుణం. ఎవరయినా ఇంటికి వచ్చినవాళ్ళు పిల్లలతో కలసిపోయి కాసేపు సరదాగా వుంటే వాతావరణమంతా సరదాగా వుంటుంది. అంతేగాని వచ్చినదగ్గర నుంచి పిల్లల్ని కామెంటు చేయడం మొదలుపెడితే తలిదండ్రులకు విసుగు ఎక్కువయి ప్రతి చిన్నదానికి పిల్లల్ని చిరాకు పరచటం జరుగుతుంది. ఎవరినో ఏదో ఎంటర్‌టెయిన్ చేయబోయి అనవసరంగా పిల్లల్ని చెడగొట్టుగొంటున్నది. తన మంచితనం వల్ల పిల్లలకి శిక్ష పడకూడదు. మర్యాదలు తెలియని వారిదగ్గర మర్యాదలు మరచిపోవడమే మంచిది. ఇక మీదట అతడితో వుండే పరిచయానికి స్వస్తి చెప్పాలి అని గట్టిగా నిర్ణయించుకొంది.

ఇదంతా జరిగిన ఆరు సంవత్సరాల తరువాత ఒకనాటి సాయంకాలం ప్రభాకర్ హడావిడిగా వచ్చి "శారదా! రామారావు గారు గుర్తువున్నారు గదూ! మనతోపాటు షికాగోలో వుండేవారు. తరువాత న్యూయార్కు వెళ్ళిపోయారు. ఇక్కడేదో కాన్ఫరెన్సు వుండి వచ్చారట. హోటల్ నుంచి ఆఫీసుకు కాల్ చేశారు. మనింటికి రమ్మన్నాను. ఈపాటికి వచ్చేస్తూవుండాలి" అన్నారు. శారద త్వరత్వరగా ఇల్లు కాస్త పైపైనే సర్దింది. "మరి ఇప్పటికప్పుడే అంటే భోజనం ఎలాగండీ?" అంది "పరవాలేదులే అందరూ కలసి పిజా ఏదయినా తెప్పించుకొందాం" అన్నారు. ఇంతలో బయట కాలింగ్ బెల్ మోగింది.

## చెరువుగట్టు

ఆలస్యంగా అర్ధరాత్రి దాటి
 చెట్ల కొమ్మల్లోంచీ ఉదయిస్తున్న
చందమామ
తొక్కతీసిన మామిడిపండులా
రసార్ద్రంగా చవులూరిస్తూ

కలుసుకొన్న అభిసారిక
అధరామృతంలో మైమరచీ
చెట్టు క్రింద చలిలో
వేచిన క్షణాల జీడిపప్పుని
పంటితో భోగిస్తూ

చీకటి రహస్యాలని శరీరంతో
అన్వేషిస్తూ అలమటించే
ప్రణయజ్వాల
మండి. పదనెక్కి. చల్లారేప్పటికి

చంద్రుడు కైపెక్కి పైకెక్కి
వెన్నెలలు జార్చి
బోసిగా బోడిగా తృప్తిగా
ప్రకాశిస్తూ నవ్వుతూ
చెరువు గట్టునీ
చెరువు నీటినీ
బట్టబయలు చేశాడు!

తెల్లవారడానికి ఎంతో జాగులేదు
మెల్లిగా విడిపోయారు ప్రేమికులు.

—ఆర్. ఎస్.

రామారావు ఫామిలీతో వచ్చారు. భార్య ఇద్దరు కొడుకులు తలుపులు తియ్యగానే పారాషూట్స్‌లాగ వచ్చారు, పిల్లలు ఇంటిలోకి. ఇంకా శారదకు, రామారావు భార్యకు పరిచయాలు ముగియనే లేదు. అప్పుడే రిఫ్రిజిరేటరు తలుపు దభీమని తియ్యడం చప్పుడు. ఆ వెనువెంటనే కోక్ సీసా క్రిందబడి బద్దలవడం వినిపించాయి.

శారద అటుగా వెళ్ళింది వడివడిగా.

ప్రభాకర్. రామారావు ఆయన భార్య పార్వతి అందరూ లోపలికి వచ్చారు. శారద రిఫ్రిజిరేటరులో దిగువన కోక్ సీసాలు వుంచింది. డోరు దభీమని తియ్యడం వలన సీసా క్రింద పడిపోయింది. రామారావు పిల్లలు పగిలిన సీసా వంక చూస్తూ లివింగు రూములోకి పరుగెత్తుతున్నారు. ఆశ్చర్యం! రామారావు, అతని భార్య చూస్తూ నిలబడ్డారే గాని పిల్లల్ని అదేమని అడగ లేదు. శారద సీసా ముక్కలన్నీ తీసివేసి శుభ్రపరచింది.

అందరూ కూర్చుని కొంతసేపు క్షేమ సమాచారాలు మాటలాడుకొన్నారు. పిజా వచ్చింది. అప్పుడు చూడాలి రామారావు పిల్లల హడం. పిజాను ఒకరి ప్లేటులో ఒకరు విసిరివేసుకోవడం, కోక్ పారబోయడం, ధనధనమని పరుగులెత్తడం ఒక్క నిముషమయినా శారదకు నెమ్మదిగా కూర్చోవటానికి వీలులేకపోయింది.

తలిదండ్రు లిద్దరూ పిల్లల్ని అదేమని మందలించరు. పైగా రామారావు "మా పిల్లలు చాల ఆక్టివ్ అండీ! ఒక్క నిముషమయినా ఒక చోట కూర్చోరు. చాల తెలివి వున్నది. మనం మరీ ప్రతి చిన్న విషయానికీ కంట్రోల్ చేస్తే దమ్మ్‌ లాగ తయారవుతారు అని మా ఆవిడ అంటుంది. అదే నాకూ నిజమనిపిస్తుంది. మా పార్వతి ఎం.ఎ. చదువుకొందిలెండి. అందుకే మా పిల్లల్ని ఎప్పుడూ చాల ఆక్టివ్‌గా వుండే టట్టు చూసుకొంటుంది." అన్నారు గర్వంగా శారద ఏమనలేకముక్కుమీద వేలేసుకుంది. ఏమిటి ఈ లోకం తీరు అనిపించింది. కాకపోతే ఎప్పుడోఎవరో కవి వ్రాసినట్టుగుర్తు- మన భారతీయ పురుషుల్లో చాలా మందికి తమ భార్యలు తప్ప మిగిలిన వారంతాతెలివి లేని దద్దమ్మలని. అందరికన్నా తమ పిల్లలే గొప్పవారని అనుకొంటారని! అది నిజమేనేమో అనిపించింది.

